క్లుప్తంగా

8న సమాజ్‌వాది పార్టీ బహిరంగ సభ



సమావేశంలో మాట్లాడుతున్న నేతలు

నెహ్రూనగర్: సమాజ్‌వాది పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 8న క్రోసూరులో రాష్ట్రస్థాయి బహిరంగ సభ నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకట సత్యనారాయణమూర్తి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ యాదవ్ వెల్లడించారు. నగరంపాలెంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో సమాజ్‌వాది పార్టీ 175 నియోజకవర్గాల్లో పోటీ చేస్తుందని తెలిపారు. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా సమాజ్ వాది పార్టీ కార్యకర్తలు, నాయకులను సిద్ధం చేస్తూ వారిలో ఉత్తేజాన్ని నింపేందుకు భారీ బహిరంగ సభను ఏర్పాటు చేస్తున్నట్లు తెలియజేశారు. బడుగు, బలహీన వర్గాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీల అభివృద్ధి, అభ్యున్నతే ధ్యేయంగా పనిచేసేందుకు పార్టీ కృషి చేస్తుందని వివరించారు.

సేవాసదన్‌కు అనాథ తరలింపు



అనాథను సేవాసదన్‌కు తరలిస్తున్న గుంటూరు కోవిడ్ ఫైటర్స్ చారిటబుల్ ట్రస్టు సభ్యులు

గుంటూరు మెడికల్: అన్నం నీరు లేక జీవచ్ఛవంలా పడిఉన్న వ్యక్తిని ఆశ్రమంలో చేర్పించినట్లు గుంటూరు కోవిడ్ ఫైటర్స్ చారిటబుల్ ట్రస్టు సభ్యులు చెప్పారు. నగరంలోని కోడిగుడ్ల సత్రం వద్ద బుధవారం ఉదయం నడిరోడ్డు మీద వ్యక్తి పడి ఉన్నాడని ఫోన్ కాల్ రావడంతో స్పందించి ఘటనా స్థలానికి వెళ్లినట్లు తెలిపారు. వెంటనే అతడ్ని అక్కడ నుంచి తరలించి గోరంట్లలోని కార్మెల్ సేవా సదన్‌లో చేర్పించినట్లు ట్రస్టు సభ్యులు పఠాన్ అల్లాహ్ బక్షు, ఆటోగౌస్, షేక్ షఫీ, పఠాన్ ముజీబ్‌బాషా, షేక్ యూసూబ్, సమీఉల్లా తెలిపారు.

విద్యార్థులకు మిఠాయిల పంపిణీ



సభలో మాట్లాడుతున్న రవీంద్రబాబు

పాత గుంటూరు: బ్రాడీపేటలోని శ్రీ షిర్డీ సాయి దీనజన సేవాసమితి అంధుల పాఠశాలలో సినీ నటుడు డాక్టర్ చిరంజీవికి పద్మవిభూషణ్ అవార్డు పురస్కరించుకొని అఖిల భారత చిరంజీవి యువత ఆధ్వర్యంలో బుధవారం కేక్ కట్ చేశారు. దివ్యాంగ విద్యార్థులకు మిఠాయిలు, పండ్లు పంపిణీ చేశారు. చిరంజీవి యువత వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల రవీంద్రబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో చిరంజీవి అభిమానులు అన్వర్ బాషా, శంకర్‌రెడ్డి, ఎం. రమేష్ పాల్గొన్నారు.

దిశ పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌గా వేమారెడ్డి



పట్నంబజారు: గుంటూరు దిశ పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా ఈ.వేమారెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు జిల్లాలో పలు స్టేషన్ల సీఐగా పనిచేసిన ఆయన గతంలో గుంటూరు వెస్ట్ ట్రాఫిక్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా దిశ పీఎస్ ఎస్‌హెచ్‌ఓగా నియమితులైన ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి సీఎం జగన్ కృషి

- తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా
- డ్వాక్రా గ్రూపు మహిళలకు వైఎస్సార్ ఆసరా చెక్కు పంపిణీ



మహిళలతో కలిసి సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా, మేయర్ కావటి, నూరి ఫాతిమా

నెహ్రూనగర్: మహిళలు ఆర్థికంగా అన్ని రంగాల్లో రాణించే విధంగా సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఎంతగానో కృషి చేస్తున్నారని, వారి అభ్యున్నతికి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా పేర్కొన్నారు. తూర్పు నియోజకవర్గ పరిధిలోని పాత గుంటూరు ఆంజనేయస్వామి గుడి వద్ద డ్వాక్రా గ్రూపు మహిళలకు వైఎస్సార్ ఆసరా చెక్కును నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమా, డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబుతో కలిసి బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరా ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఎంతోమంది డ్వాక్రా మహిళలకు లబ్ధి చేకూరుతోందని తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారంటే తప్పకుండా నెరవేర్చుతారని చెప్పారు. పాదయాత్రలో ఇచ్చిన హామీ ప్రకారం డ్వాక్రా రుణమాఫీ చేస్తున్నారన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే పాదయాత్రలో ఇచ్చిన హామీల్ని 99 శాతం పైగా నెరవేర్చిన ఘనత ఆయనకే దక్కుతుందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ముస్తఫా సూచించారు. ప్రజల్ని మోసం చేయడంలో చంద్రబాబు గిన్నిస్ రికార్డు సాధించారని ఎద్దేవా చేశారు. నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశ పెడుతున్నారన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు రుణమాఫీ ద్వారా వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని తెలిపారు. మహిళలను లక్షాధికారులను చేసే దిశగా జగన్ మోహన్ రెడ్డి చర్యలు తీసుకుంటున్నారని, దానిలో భాగంగానే రాష్ట్రంలో 31 లక్షల మంది మహిళలకు ఇళ్ల పట్టాలు అందజేశారని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త నూరి ఫాతిమా మాట్లాడుతూ ఎన్నికల ముందు చెప్పినట్లుగానే హామీల్ని నెరవేరుస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. డ్వాక్రా గ్రూపు మహిళలకు రుణ మాఫీ కింద నాలుగు విడతల్లో వారి బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ చేయడం అభినందనీయమన్నారు. అనంతరం డ్వాక్రా సంఘాల మహిళలు ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో 8వ డివిజన్ కార్పొరేటర్ ఇర్రి ధనలక్ష్మి, వార్డు ప్రెసిడెంట్ పుల్లా కిశోర్‌బాబు, వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సామాజిక సేవాతత్పరులు ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు



మాట్లాడుతున్న రవిశంకర్‌రెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల్లో సామాజిక సేవా భావాన్ని పెంపొందిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు సేవాతత్పరులని ఏఎన్‌యూ ఎన్‌ఎస్‌ఎస్ విభాగ సమన్వయకర్త డాక్టర్ డి. రవిశంకర్ రెడ్డి పేర్కొన్నారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ విభాగ ఆధ్వర్యంలో బుధవారం "ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు-సామాజిక బాధ్యత" అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ సమాజ ప్రగతి పథంలో ఎన్‌ఎస్‌ఎస్ అధికారుల సేవలు మరువలేనివని తెలిపారు. ప్రతి ఒక్కరూ సామాజిక సేవ చేస్తూ స్వామి వివేకానంద, మదర్ థెరీస్సా అడుగుజాడల్లో నడవాలని సూచించారు. వికాస్ హాస్పిటల్స్ సీఈవో నరసింహమూర్తి మాట్లాడుతూ సామాజిక సేవాభావంతో సాటి మనిషికి సాయం చేసే తత్వాన్ని కలిగిన అధ్యాపకులు దైవంతో సమానమని తెలిపారు. ప్రొఫెసర్ ఎన్‌ఏడీ పాల్ మాట్లాడుతూ సేవా దృక్పథం ఉంటేనే ఎన్‌ఎస్‌ఎస్‌లోకి రావాలని సూచించారు. వ్యక్తిత్వ వికాస నిపుణుడు ప్రత్యూష సుబ్బారావు మాట్లాడుతూ సమాజం నిరంతరం మారుతూ ఉంటుందని, సేవాభావం ఎల్లప్పుడూ ఒకే విధంగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్, ఎన్‌ఎస్‌ఎస్ అధికారి జేవీ సుధీర్‌కుమార్, వివిధ కళాశాలల ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సేవా దృక్పథంతో సమాజాభివృద్ధికి పాటుపడాలి



విజేతకు నగదు బహుమతి అందజేస్తున్న దేబాశిష్, ఎస్వీ రమణ తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు మేనేజ్‌మెంట్ రంగంలో రాణించడంతో పాటు సేవా దృక్పథంతో సమాజాభివృద్ధికి కృషి చేయాలని ఐటీసీ జనరల్ మేనేజర్ దేబాశిష్ సూచించారు. అమరావతి రోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో మూడు రోజులపాటు నిర్వహించిన స్ఫూర్తి-ది ఐక్యూట్ ఎక్స్‌పో బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న దేబాశిష్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుతో పాటు సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా వివిధ కళాశాలల విద్యార్థులు ప్రదర్శించిన స్టాల్స్ ఆకట్టుకున్నాయి. రూరల్ అండ్ అగ్రికల్చర్ మార్కెటింగ్‌పై ఎక్స్‌పో నిర్వహించిన హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలకు చెందిన ఎంబీఏ ప్రథమ సంవత్సర విద్యార్థులతో పాటు వాటర్ సైకిల్, సముద్రం నుంచి క్రూడాయిల్‌ను వెలికితీసే ప్రాజెక్టులను ప్రదర్శించిన హిందూ కళాశాల జియాలజీ విభాగ విద్యార్థులను విన్నర్లుగా ఎంపిక చేసి రూ.ఐదు వేలు చొప్పున బహుమతి అందజేశారు. హిందూ మేనేజ్‌మెంట్ విద్యార్థులు ప్రదర్శించిన బ్యాంకింగ్ స్టాల్, హిందూ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థుల మొబైల్ రివల్యూషన్ స్టాల్‌కు ద్వితీయ బహుమతి రూపంలో రూ.3,500 చొప్పున అందజేశారు. హిందూ పీజీ, బీకాం విద్యార్థుల ప్రాజెక్టులు తృతీయ స్థానంలో నిలిచాయి. మూడో రోజు పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఎక్స్‌పో తిలకించారు. కార్యక్రమంలో ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ ఎన్. నిషాంత్, డాక్టర్ శ్రీధర్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ, స్ఫూర్తి కన్వీనర్ డాక్టర్ వి. చక్రవర్తి, కో-కన్వీనర్ డి. కళ్యాణి, సహాయాచార్యులు సీహెచ్. వైష్ణవి, సీహెచ్. వేదవతి, వి.బాజీబాబు, వి.అభిలాష్, డాక్టర్ గోపి శ్రీనివాసరావు, ఎన్. మణికంఠ, బి. అనిత, విద్యార్థులు పాల్గొన్నారు.

డెప్యూటీ కమిషనర్- 1గా వెంకటలక్ష్మి



కమిషనర్‌కు మొక్కను అందజేస్తున్న వెంకటలక్ష్మి

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ డెప్యూటీ కమిషనర్ - 1గా డి. వెంకటలక్ష్మి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా నగర కమిషనర్ కీర్తి చేకూరిని ఆమె చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఇప్పటిదాకా డెప్యూటీ కమిషనర్‌గా పనిచేసిన బి. శ్రీనివాసరావు సీడీఎంఏ కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో వెంకటలక్ష్మి బాధ్యతలు స్వీకరించారు.

అదనపు కమిషనర్‌గా రాజ్యలక్ష్మి

నగరపాలక సంస్థ అదనపు కమిషనర్‌గా కె. రాజ్యలక్ష్మిని నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్. జవహర్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం అదనపు కమిషనర్‌గా పనిచేస్తున్న కె. లక్ష్మీశివజ్యోతి గోపాలపురానికి బదిలీపై వెళ్లనున్నారు.

గ్రామాలను నోటిఫై చేయాలి

కలెక్టర్‌కు ఏపీ ఎన్జీవో నేతల వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎన్జీవో నేతలు

గుంటూరు మెడికల్: తాడేపల్లి, మంగళగిరి ప్రాంతం నుంచి ఎనిమిది కిలోమీటర్ల పరిధిలో ఉన్న గ్రామాలను నోటిఫై చేస్తే ఉద్యోగులందరికీ ఇంటి అద్దె అలవెన్స్ 16 శాతం క్లెయిమ్ చేయడానికి అవకాశం ఉంటుందని ఏపీ ఎన్జీవో నేతలు తెలిపారు. ఈ మేరకు ఏపీ ఎన్జీవో అసోసియేషన్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు, కార్యదర్శి శెట్టిపల్లి సతీష్ కుమార్ బుధవారం జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డిని ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి, వినతిపత్రం సమర్పించారు. ఇటీవల తాడేపల్లి, మంగళగిరి మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఇంటి అద్దె అలవెన్స్‌ను ప్రభుత్వం 12 నుంచి 16 శాతానికి పెంచిన సంగతి తెలిసిందే. వెంటనే ఆయా గ్రామాలను నోటిఫై చేయాలని కలెక్టర్‌ను నేతలు కోరారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ గ్రామాలను త్వరితగతిన నోటిఫై చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్. వెంకటరెడ్డి, డి.నాయక్, సంయుక్త కార్యదర్శి కె.శ్రీనివాసరావు, మహిళా సంయుక్త కార్యదర్శి కె.శివజ్యోతి, కోశాధికారి ఎల్.శ్రీధర్ రెడ్డి, నగర అధ్యక్షుడు ఎస్.పి.ఎస్.సూరి, మహిళా విభాగం జిల్లా కన్వీనర్ కె.లక్ష్మీ రమ్య, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు కె.మురళీకృష్ణ, దుర్గారావు ఉన్నారు.

దళిత క్రైస్తవులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలి



డిమాండ్లు ప్రదర్శిస్తున్న దళిత క్రైస్తవ నాయకులు

నెహ్రూనగర్: రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు దళిత, క్రైస్తవులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని ఆల్ ఇండియా క్రిస్టియన్ యూత్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ గోళ్లమూడి రాజసుందరబాబు విజ్ఞప్తి చేశారు. అంబేడ్కర్ భవన్‌లో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1950 నుంచి క్రైస్తవం, ముస్లిం మతం తీసుకున్న ఎస్సీలకు అన్యాయం జరుగుతోందని తెలిపారు. 70 సంవత్సరాలుగా తమకు ఎస్సీ హోదా కల్పించాలని దేశ రాజధాని ఢిల్లీలో అనుదినం ఉద్యమం చేస్తున్నా, ఇప్పటి వరకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని మూడు ప్రాంతాల్లో లోక్‌సభ స్థానాలను దళిత, క్రైస్తవులకు కేటాయించాలన్నారు. ప్రధానంగా గుంటూరు లోక్‌సభ స్థానాన్ని సుమారు 21 శాతంగా ఉన్న దళిత క్రైస్తవులకు కేటాయించాలని కోరారు. పార్టీలు స్పందించని పక్షంలో దళిత క్రైస్తవులే స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఐక్య నాయకులు గద్దం సురేష్, గోరపాటి అజయ్, రాయపూడి చిన్నరాజు, రాయపూడి మరియదాసు, నల్లపు నీలాంబరం, పాల్‌కుమార్, సురేష్ జేమ్స్, వేముల భారతి, ప్రేమకుమారి, సోమమ్మ తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలు, ఉద్యమాల గొంతుక గద్దర్



గద్దర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విలియమ్స్, రాజసుందరబాబు

నెహ్రూనగర్: దళిత, బడుగు, బలహీనవర్గాల ప్రజల సమస్యలపై అనేక పోరాటాలకు, ఉద్యమాలకు తన గొంతుక ద్వారా ఊపిరి పోసిన ప్రజా నాయకుడు గద్దర్ అని చార్వాక యువజన సంఘం అధ్యక్షుడు చిన్నం డేవిడ్ విలియమ్స్ పేర్కొన్నారు. గద్దర్ జయంతిని పురస్కరించుకుని చార్వాక యువజన సంఘం ఆధ్వర్యంలో లాడ్జి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద గద్దర్ చిత్రపటానికి బుధవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న సామాజికవేత్త డాక్టర్ గోళ్లమూడి రాజా సుందరం బాబు మాట్లాడుతూ గద్దర్ పాటలు నేటికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో నరేంద్ర సుధాకర్, వేము సమత, శెట్టి అంబేద్కర్, గిరిధర్ కుమార్, తిప్పాబత్తుని గోవింద్, అశోక్ కుమార్, రాయపూడి మరియదాస్ పాల్గొన్నారు.

ప్రజల హక్కుల పరిరక్షణకు గద్దర్ నిరంతర పోరాటం

నెహ్రూనగర్: ప్రజల హక్కుల పరిరక్షణకు నిరంతరం అలుపెరుగని పోరు సలిపిన ప్రజా యుద్ధ నౌక గద్దర్ అని ఎస్సీ వెల్ఫేర్ సెక్రటరీ జనరల్ మేడిద బాబురావు పేర్కొన్నారు. అంబేడ్కర్ భవన్‌లో బుధవారం గద్దర్ జయంతి సభను భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షుడు పాగళ్ల ప్రకాష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ పేదల కోసం జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు గద్దర్ అని కొనియాడారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు నల్లపు నీలాంబరం, ప్రభుదాస్, జూపూడి శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.

అవగాహన సంస్థ ఆధ్వర్యంలో ఘన నివాళి

లక్ష్మీపురం: అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో బుధవారం గద్దర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి, రచయిత కనగాల జయకుమార్, సంస్థ సభ్యులు, సీనియర్ సిటిజన్స్, పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యల్ని పరిష్కరించేందుకు కృషి

పట్నంబజారు: ప్రజల సమస్యల్ని త్వరితగతిన పరిష్కరించేందుకు అన్ని వేళలా కృషి చేస్తామని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా చెప్పారు. నియోజకవర్గంలోని పదో డివిజన్ అలీనగర్ జెండా చెట్టు సమీపంలో ప్రజలు తాగునీటి పైపులైను వల్ల ఇబ్బంది పడుతున్నారు. నూరిఫాతిమా బుధవారం సొంత నిధులతో పైపులైను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా నియోజకవర్గంలో పైపులైను పనులు పూర్తి చేసినట్లు వెల్లడించారు. ఎవరికి ఏ ఇబ్బంది వచ్చినా నేరుగా తన దృష్టికి తీసుకు రావచ్చని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

వెనిగండ్ల సర్పంచికి నోటీసులు

పెదకాకాని: నిబంధనలకు విరుద్ధంగా నిధులు డ్రా చేసిన కారణంగా సర్పంచికి జిల్లా పంచాయితీ అధికారి నుంచి షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి. పెదకాకాని మండలంలోని వెనిగండ్ల పంచాయతీ సర్పంచి వేల్పుల శ్రావణి ఆర్థిక అవకతవకలకు పాల్పడినట్లు గ్రామానికి చెందిన వల్లబాపురపు ప్రేమ్‌సాగర్ స్పందనలో ఫిర్యాదు చేశారు.

లక్ష్య సాధనకు ప్రణాళిక అవసరం

ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు



ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

ఏఎన్‌యూ: ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగితేనే నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించగలుగుతారని ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు తెలిపారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం యూనివర్సిటీలో జరిగిన గ్రూప్-2 అవగాహనా కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ప్రస్తుతం వివిధ పోటీ పరీక్షలకు నోటిఫికేషన్లు వచ్చాయని, వాటికి ప్రణాళికాబద్ధంగా సిద్ధం అయితే విజయాలు సాధ్యమవుతాయని సూచించారు. అనుకున్న లక్ష్యాలు పొందేందుకు ప్రతి ఒక్కరూ వారు ఎంచుకున్న సబ్జెక్టుపై కనీస అవగాహన పెంచుకోవాలని తెలిపారు. ముఖ్యంగా సామాజిక స్థితిగతులు పరిశీలన చేయాలని పేర్కొన్నారు. గౌరవ అతిథిగా పాల్గొన్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి. కరుణ మాట్లాడుతూ యూనివర్సిటీలో విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లక్ష్యం దిశగా పయనిస్తే ఉద్యోగాలు పొందవచ్చునని తెలిపారు. అనంతరం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రూపొందించిన గ్రూప్- 2 మెటీరియల్‌ను 500 మందికి ఉచితంగా అందజేశారు. జర్నలిజం విభాగాధిపతి డాక్టర్ అనిత, పొలిటికల్ సైన్స్ అధ్యాపకులు డాక్టర్ అంజిరెడ్డి, తక్షశిల ఐఏఎస్ కోచింగ్ సెంటర్ నిర్వాహకులు దుర్గాప్రసాద్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్, రాష్ట్ర కమిటీ సభ్యురాలు సమిత, యూనివర్సిటీ అధ్యక్షుడు సంతోష్, సెక్రటరీ ఆదిశేషు, భార్గవి, అజయ్, ఆకాష్ పాల్గొన్నారు.

9న బీజేపీ 'పల్లెకు పోదాం.. చలో' ప్రారంభం



మాట్లాడుతున్న మధుకర్‌జీ

గుంటూరు మెడికల్: నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో పల్లెకు పోదాం చలో కార్యక్రమంపై జిల్లా స్థాయి ప్రశిక్షణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి నూకల మధుకర్‌జీ ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. బీజేపీ పల్లెకు పోదాం చలో కార్యక్రమాన్ని ఈనెల 9న ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. ప్రతి నాయకుడు పల్లెకు వెళ్లి అక్కడ సంస్థాగతంగా పార్టీ నిర్మాణాన్ని చేపట్టి, బస చేయాలని తెలిపారు. కార్యక్రమ రాష్ట్ర కన్వీనర్ మట్టు ప్రసాద్ మాట్లాడుతూ మోదీ తొమ్మిదేళ్లలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల్ని ప్రజలకు వివరించాలని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు చందు సాంబశివరావు, పార్లమెంటు కన్వీనర్ భీమినేని చంద్రశేఖర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాటిబండ్ల రామకృష్ణ, రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ, సీనియర్ నాయకులు జూపూడి రంగరాజు, పల్లెకు పోదాం చలో కార్యక్రమం కన్వీనర్లు యడ్లపాటి స్వరూప రాణి, విజయభాస్కర్ రెడ్డి, జంధ్యాల రామలింగ శాస్త్రి, రాష్ట్ర పదాధికారి కొక్కెర శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శులు చరక కుమార్ గౌడ్, వై.వి. సుబ్బారావు, చుండు ఉమామహేశ్వరరావు, ఉపాధ్యక్షులు పద్మనాభం, అమ్మయ్య చౌదరి, సుగుణ, కలపాల శ్రీనివాసు, ఆవుల రాము, రెడ్డి శివపార్వతి పాల్గొన్నారు.

3 సినీ సంగీత విభావరి

పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో ఈ నెల 3న సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు శ్రీ శుభాంజలి కళావేదిక అధ్యక్షుడు మేకల పురుషోత్తమ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో సంగీత విభావరి, అనంతరం సభలో మిరాకిల్స్ వరల్డ్ రికార్డు సంస్థ జ్యూరీ సభ్యులుగా ఎంపికైన డాక్టర్ పట్టాభి కళాపీఠం అధ్యక్షులు డాక్టర్ తూములూరి రాజేంద్రప్రసాద్‌కు ఆత్మీయ సత్కారం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సంగీతాభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.